క్లుప్తంగా

వేంకటేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ట



స్వామిని దర్శించుకుంటున్న మడకశిర ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప

మడకశిర: పట్టణంలోని వడ్రపాళ్యంలో వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్టాపన శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామి వారి శనివారం కల్యాణోత్సవం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప, మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి వైసీ గోవర్ధన్‌రెడ్డి, మండల, పట్టణ కన్వీనర్లు రామిరెడ్డి, పుట్టకామప్ప, ఎంపీపీ సత్యనారాయణరెడ్డి, గుడిబండ జెడ్పీటీసీ భూతరాజు, జయరాజ్, కౌన్సిలర్ దాసప్ప స్వామిని దర్శించుకుని పూజలు చేపట్టారు.

హాస్టల్ భవనం దగ్ధం



ప్రమాదంలో కాలిపోయిన మంచాలు

పావగడ: వైఎన్ హొసకోట గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ప్రభుత్వ మెట్రిక్ పూర్వ బాలల హాస్టల్ భవనం దగ్ధమైంది. ఆ సమయంలో పలువురు విద్యార్థులు భవనం లోపల ఉక్క పోస్తుండడంతో భవనం వెలుపల ఆరుబయట నిద్ర పోతుండడంతో ప్రాణనష్టం తప్పింది. కాగా భవనంలో పడుకున్న ఒకరిద్దరు విద్యార్థులు మాత్రం విద్యుత్ మీటర్ వద్ద వైర్ కాలి పోతుండడం చూసి బయటకు పరుగులు తీసి ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. ఈ ప్రమాదంలో విద్యార్థుల పుస్తకాలు, వస్తువులు, దుస్తులు, ట్రంకు పెట్టెలు కాలిపోయాయి. మంచాలు, పరుపులు కాలి బూడిదయ్యాయి. అగ్ని మాపక దళం వేళకు సంఘటనా స్థలానికి చేరుకుని మంటల్ని ఆర్పివేశారు. ఈ సంఘటన పై సాంఘిక సంక్షేమ శాఖ అధికారి మల్లికార్జున వైఎస్ హొసకోట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై దర్యాప్తు ప్రారంభించినట్లు సీఐ గిరీశ్ తెలిపారు.

తుది దశకు నక్కలపల్లి వంతెన నిర్మాణం



బ్రిడ్జి నిర్మాణ పనులు పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు గుడ్డంపల్లి వేణురెడ్డి

హిందూపురం: హిందూపురం మండలం నక్కలపల్లి రహదారిలోని బ్రిడ్జి నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. శనివారం బ్రిడ్జి తుది దశ నిర్మాణ పనులను నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకుడు గుడ్డంపల్లి వేణురెడ్డి పర్యవేక్షించారు. త్వరితగతిన పనులు పూర్తిచేసి గ్రామస్తులకు రాకపోకలకు సౌకర్యం కల్పించాలన్నారు. రూ.1.20 కోట్లతో బ్రిడ్జి పనులు ప్రారంభించినట్లు తెలిపారు. బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తిచేస్తుండటంతో నక్కలపల్లి తదితర గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సీనియర్ నాయకులు శ్రీరామిరెడ్డి, తిప్పేరుద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

పెనుకొండ: పట్టణంలో శనివారం శ్రీసత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో భక్తులు చలివేంద్రం ఏర్పాటు చేశారు. వేసవి నేపథ్యంలో ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో ప్రజల దాహార్తిని తీర్చడానికి కృష్ణదేవరాయ సర్కిల్‌లో చలివేంద్రం ప్రారంభించారు.

30న రన్ ఫర్ జీసస్



పోస్టర్లను విడుదల చేస్తున్న సంఘం సభ్యులు

హిందూపురం టౌన్: గుడ్ ఫ్రైడే, ఈస్టర్ పండుగలను పురస్కరించుకుని ఈనెల 30 శనివారం ఉదయం 6 గంటలకు చేపట్టిన రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఅండ్‌జీ మిషన్ కాంపౌండ్ చర్చి సంఘం కార్యదర్శి, ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ నాగేంద్రకుమార్ తెలిపారు. ఈ మేరకు శనివారం చర్చిలో పోస్టర్లను విడుదల చేశారు. ఆరాధన టీవీ సౌజన్యంతో హిందూపురం పాస్టర్ ఫెలోషిప్ సహకారంతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద నుంచి రన్ ఫర్ జీసస్ ప్రారంభమవుతుందని, క్రైస్తవులందరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సంఘ పాస్టర్ స్టీఫెన్ రాజ్, కోశాధికారి విక్టర్ జాషువా, జాయింట్ సెక్రెటరీ సాల్మన్ రాజ్, జాయింట్ ట్రెజరర్ ఆనంద్ రాజ్, సభ్యులు జార్జి బాబు, తదితరులు పాల్గొన్నారు.

జగన్‌ను మళ్లీ సీఎం చేసుకుందాం

- ఎన్నికల ప్రచారంలో మంత్రి ఉషశ్రీచరణ్





రొద్దం: ప్రచారం చేస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్, బీదానిపల్లిలో టీడీపీ నాయకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్

రొద్దం: సంక్షేమ పథకాల ప్రదాత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేసుకుందామని మంత్రి ఉషశ్రీచరణ్ అన్నారు. శనివారం రాత్రి మండలంలోని బీదానిపల్లిలో ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఆమె మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటామని, ప్రజా సేవ చేయడానికి పెనుకొండ ఎమ్మెల్యేగా తనను అత్యధిక మెజార్టీతో గెలుపించాలని ఓటర్లను అభ్యర్థించారు. టీడీపీ తప్పుడు హామీలను నమ్మి ప్రజలు మోసపోవద్దన్నారు. అదేవిధంగా బీదానిపల్లి, రాచూరు గ్రామాలకు చెందిన నాయకులు పలువురు టీడీపీ నుంచి మంత్రి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి మంత్రి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో రాచూరు పెంకుల అంజి, బంగారు ముత్యాలప్ప, తిరుమలేష్, రామక్రిష్టప్ప, బీదానిపల్లిలో అంజినమ్మ, సునీత, కమలమ్మ, క్రిష్టప్ప, శ్రీరామ్, వెంకట చలపతి, బోయ నాగరాజు తదితరులున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చంద్రశేఖర్, జెడ్పీటీసీ సభ్యురాలు పద్మావతి, పార్టీ మండల కన్వీనర్ బి.తిమ్మయ్య, జేసీఎస్ కన్వీనర్ చిలకల రవి, న్యాయవాది అశ్వర్థనారాయణ, నాయకులు అక్కులప్ప, ఎస్.నారాయణరెడ్డి, రామక్రిష్ణ, ప్రభాకర్, నరసింహులు, వినయ్‌రెడ్డి, ఉజ్జినప్ప తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైస్సార్‌సీపీలో చేరిక

పెనుకొండ రూరల్: మండలంలోని మావటూరు పంచాయతీ సత్తారుపల్లి గ్రామానికి చెందిన, గోపాల్‌రెడ్డి టీడీపీని వీడి స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి, పెనకొండ నియోజకవర్గం అభ్యర్థి ఉషశ్రీ చరణ్ సమక్షంలో శనివారం వైఎస్సార్‌సీపీలో చేరారు. మంత్రి పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు.

రొద్దం: మండలంలోని కోగిర గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు నరసింహప్ప కుటుంబం వైఎస్సార్‌సీపీలో చేరింది. శనివారం సాయంత్రం మంత్రి ఉషశ్రీచరణ్ బీదానిపల్లి లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీని వీడి మంత్రి ఆధ్వర్యంలో వారు వైఎస్సార్ సీపీ తీర్థం పుచ్చుకున్నారు. మంత్రి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకునేందుకు అందరం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ జెండా ఎగరేద్దాం



మెళవాయిలో నాయకులతో కలిసి మాట్లాడుతున్న మడకశిర ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప

- ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప

మడకశిరరూరల్: క్షేత్ర స్థాయిలో కష్ట పడి పని చేసి మరోసారి మడకశిరలో వైఎస్సార్‌సీపీ జెండాను ఎగరవేద్దామని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. నాయకులతో కలిసి ఆయన శనివారం మెళవాయి, జిల్లెడుగుంట, గోవిందాపురం పంచాయతీల్లో పర్యటించారు. మెళవాయి సర్పంచ్ రంగనాథ్, జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి మంజునాథ్, ఎంపీటీసీ తాళికేరమ్మ, నాయకులు జయరామ్, వివిధ కమిటీల సభ్యులను కలిసి మద్దతు కోరారు. మడకశిరలో పలువురు నాయకులను కలిశారు. పార్టీ గెలుపునకు అందరూ కలిసి సమిష్టగా పని చేస్తామని వారు తెలిపారు. ఈ సందర్భంగా ఈరలక్కప్ప మాట్లాడుతూ టీడీపీ పాలనకు జగనన్న పాలనకు ఉన్న తేడాను ప్రజలు గమనించాలన్నారు. టీడీపీ హయాంలో ఏ సంక్షేమ పథకం కావాలన్నా టీడీపీ నాయకుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సచివాలయ, వలంటీర్ వ్యవస్థలతో ఇంటి వద్దకే సేవలు, సంక్షేమ పథకాలు అందిస్తున్నారని తెలిపారు. ఎన్నికల్లో టీడీపీ నాయకులు చెప్పే మాయ మాటలు నమ్మి మోసపోవద్దని ప్రజలకు సూచించారు. ప్రతి గ్రామం, కుటుంబంలో మరింత అభివృద్ధి, సంక్షేమం కోసం ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. మరోసారి వైఎస్ జగన్‌ను ముఖ్యమంత్రిగా చేసుకుందామన్నారు. కష్ట పడిన ప్రతి కార్యకర్తకు భవిష్యత్‌లో గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు రామిరెడ్డి, ఎంపీపీ కవిత, జేసీఎస్ మండల కన్వీనర్ నాగేంద్ర, నాయకులు నాగభూషణరెడ్డి, నరేష్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

‘పురం’లో విజయం సాధించాలి



మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న జిల్లా అధ్యక్షుడు నవీన్ నిశ్చల్

హిందూపురం: త్వరలో జరిగే ఎన్నికల్లో పురంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరవేసే బాధ్యత తీసుకుంటామని ఏపీ ఆగ్రోస్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బి.నవీన్ నిశ్చల్ అన్నారు. శనివారం రాష్ట్ర భూగర్భ గనులు, విద్యుత్, అటవీశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా అధ్యక్ష పదవి ఇవ్వడంలో సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి మాట్లాడుతూ.. రాబోవు ఎన్నికల్లో పురంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేయాలని సూచించారు. నాయకులను అందరినీ కలుపుకుని బాలకృష్ణను చిత్తుగా ఓడించాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఎలక్షన్ అబ్జర్వర్ రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఉచిత న్యాయ సహాయం



మాట్లాడుతున్న అదనపు జిల్లా న్యాయమూర్తి శైలజ

హిందూపురం అర్బన్: అర్హులైన వారందరికీ ఉచిత న్యాయ సహాయం అందజేయడం జరుగుతుందని అదనపు జిల్లా జెడ్జి కంపల్లె శైలజ పేర్కొన్నారు. శనివారం స్థానిక కోర్టు ఆవరణలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులతో ఎంతో మంది న్యాయవాదులను ఏర్పాటు చేసుకోలేక పోతుంటారన్నారు. అలాంటి వారికి ఉచిత న్యాయ సహాయం అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. న్యాయ సహయం అవసరమైన వారు దరఖాస్తు చేసుకుంటే జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయవాదులను ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం లోక్ అదాలత్‌లో పలు కేసులు పరిష్కరించారు.

నిర్మల వృద్ధాశ్రమంలో..

కొట్నూరు నిర్మల వృద్ధాశ్రమంలో జరిగిన సదస్సులో న్యాయవాదులు మాట్లాడుతూ.. వృద్ధుల పట్ల ప్రేమాభిమానాలు కలిగి ఉండాలన్నారు. తల్లిదండ్రులను చూసుకోవాల్సిన బాధ్యత కుమారులు, కుమార్తెలపై ఉందన్నారు. ఆశ్రయం లేని వృద్ధులు భరణం కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అనంతరం వృద్ధులకు పండ్లు, బ్రెడ్డు అందజేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు సుదర్శన్, పీపీ శ్రీనివాసరెడ్డి, వన్నెరప్ప, పార్వతి, పవేరా, రామిరెడ్డి, గోపాల్, భరత్, గురునాథ్, శ్రీనివాసులు, లోక్ అదాలత్ సిబ్బంది భారతి తదితరులు పాల్గొన్నారు.

వయోవృద్ధులు ఇంటి నుంచే ఓటు వేయొచ్చు



మాట్లాడుతున్న నియోజకవర్గ ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ సీహెచ్ శివ ప్రసాద్ రెడ్డి

హిందూపురం: వృద్ధులు, దివ్యాంగులు ఇంటి నుంచే ఓటు హక్కు వినియోగించుకునేలా ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేస్తోందని నియాజకవర్గ ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్, హిందూపురం తహసీల్దార్ శివ ప్రసాద్ రెడ్డి తెలిపారు. శనివారం మున్సిపల్ ఆఫీసులో మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో అర్బన్ బూత్ లెవల్ స్థాయి అధికారులతో మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 85 ఏళ్లపై బడిన వారికి, దివ్యాంగులకు ఇంటి నుంచే ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించడం మొదటి సారి అన్నారు. ఇందుకోసం ఫారం–12లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 18 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. కొత్త ఓటరుగా నమోదుకు ఫారం–6లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ వి.రెడ్డిశేఖర్, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌రెడ్డి, రెవెన్యూ, బూత్ లెవల్ అధికారులు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోండి

మడకశిర: మడకశిర నియోజకవర్గంలో నివాసం ఉండి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలని మడకశిర ఎన్నికల రిటర్నింగ్ అధికారి గౌరీశంకర్‌రావు కోరారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు ఓటు హక్కును కల్పించడానికి ఏప్రిల్ 15 వరకు గడువు ఇచ్చిందన్నారు. ఓటరు నమోదుకు అర్హత ఉన్న యువతీ, యువకులు ఫారం–6తోపాటు వయసు ధ్రువీకరణ పత్రాన్ని జతపరచి ఇవ్వాలని సూచించారు. ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చిన వారు ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకోవాలంటే పాత నివాస ప్రాంతంలో ఓటును తొలగించుకొని ఇక్కడ నమోదు చేసుకోవాలన్నారు. అక్కడి తహసీల్దార్ నుంచి ఓటరు జాబితాలో పేర్లు లేదన్న ధ్రువీకరణ పత్రాన్ని జత చేయాల్సి ఉంటుందని తెలిపారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

రొళ్ల: గర్భిణులు, బాలింతలు, రక్తహీనతతో బాధపడుతున్న వారు రోజు పౌష్టికాహారం తీసుకోవాలని సీడీపీఓ నాగమల్లేశ్వరి పేర్కొన్నారు. శనివారం దొమ్మరహట్టి అంగనవాడీ కేంద్రంలో ‘పోషణ పక్వాడ్’ కార్యక్రమంలో భాగంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులతో పాటు రొళ్ల సెకార్ పరిధిలోని అంగనవాడీ వర్కర్లతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి పౌష్టికాహారం ప్రాముఖ్యతను తెలియజేశారు. గర్భిణులకు సామూహిక సీమంతం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సన్నమ్మ, లీలావతి పాల్గొన్నారు.

పది పరీక్షలకు 66 మంది గైర్హాజరు

గోరంట్ల: పదో తరగతి ఫిజికల్ సైన్స్ పరీక్ష శనివారం ప్రశాంత జరిగినట్లు ఎంఈఓ గోపాల్ తెలిపారు. మండలంలో 1,270 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా 1,204 మంది హాజరయ్యారన్నారు. 66 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారన్నారు.

70 మంది విద్యార్థుల గైర్హాజరు

లేపాక్షి: మండల వ్యాప్తంగా శనివారం నాలుగు పరీక్ష కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు జరిగాయి. 903 మంది విద్యార్థులకు గాను 833 మంది హాజరైనట్లు ఎంఈఓలు నాగరాజు, కుళ్లాయప్ప తెలిపారు. 70 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు పేర్కొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

రొళ్ల: అలుపనపల్లిలో కర్ణాటక మద్యం విక్రయిస్తున్న నారాయణప్ప అనే వ్యక్తిని శనివారం పోలీసులు పట్టుకున్నారు. నిందితుడి నుంచి 20 90ఎంఎల్ మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపారు.

గుడిబండ: కరికెర చెక్‌పోస్టు సమీపాన శనివారం దాసరపల్లి గ్రామానికి చెందిన రంగనాథ్ అనే వ్యక్తి కర్ణాటక మద్యం తరలిస్తుండగా పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి నుంచి 300 (90ఎంఎల్) మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ మునిప్రతాప్ తెలిపారు.

లేపాక్షి: మండలంలోని కల్లూరు గ్రామంలో శనివారం మధ్యాహ్నం ఓ మహిళ అక్రమంగా కర్ణాటక మద్యం విక్రయిస్తుండగా అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ గోపి తెలిపారు. ఆమెపై కేసు నమోదు చేసి, 26 మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామన్నారు.

విద్యార్థులు ఇష్టంతో చదవాలి



నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థిని

అమరాపురం: విద్యార్థులు ఇష్టంతో చదవాలని సరస్వతి విద్యామందిరం కార్యదర్శి బాలాజీరావు, ఉపాన్యాసకులు శ్రీనివాసమూర్తి, లింగేష్ పేర్కొన్నారు. శనివారం స్థానిక సరస్వతీ విద్యామందిరంలో పాఠశాల 35వ వార్షికోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

సీ విజిల్ యాప్‌తో అక్రమాలకు అడ్డుకట్ట

పావగడ: లోక్‌సభ ఎన్నికల్లో జరిగే అక్రమాలు అడ్డుకట్ట వేయడానికి ప్రభుత్వం సీ విజిల్ యాప్‌ను విడుదల చేసిందని స్థానిక తహసీల్దార్ సంతోష్ కుమార్ తెలిపారు. స్థానిక తాలూకా కార్యాలయం సభాంగణంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సీ విజిల్ యాప్ ద్వారా ప్రజలు ఫిర్యాదు చేసిన నూరు నిమిషాలకే సంఘటనా స్థలానికి చేరుకుని చర్యలు చేపడతామన్నారు. పావగడ విధానసభ పరిధిలో మొత్తం 1,97,548 మంది ఓటర్లు ఉన్నారని వారిలో 1,00,570 మంది పురుషులు, 96,969 మంది మహిళలు, 3,558 మంది యువ ఓటర్లు ఉన్నారన్నారు. మొత్తం 246 పోలింగ్ బూతులు ఉండగా ప్రస్తుతం 200 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశామన్నారు. 25 పోలింగ్ స్టేషన్లు సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లు గా గుర్తించామన్నారు. అక్కడ గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. రాజవంతి, కొడమడుగు, నాగలాపురం, దొమ్మతమరి, అరసికెరె, వెంకటమ్మనహళ్ళి సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికలకు సంబంధించి 08136–244242 లేదా 1950 నంబరుకు సమాచారం అందివ్వాలని సూచించారు.

‘హిందూపురం’ బీజేపీకే కేటాయించాలి



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

పెనుకొండ: పొత్తులో భాగంగా హిందూపురం పార్లమెంట్ స్థానాన్ని బీజేపీకి కేటాయించాలని ఆ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలో బీజేపీ నాయకులు విలేఖరుల సమావేశం నిర్వహించారు. నాయకులు రామాంజనేయులు, రవి, రామకృష్ణ, హనుమంతు, ముత్యాలమ్మ మాట్లాడుతూ పొత్తు ధర్మం పాటించని టీడీపీ అధినేత చంద్రబాబు బీజేపి, జనసేనకు సంబంధం లేకుండా ఈ స్థానాన్ని ఏకపక్షంగా ప్రకటించడాన్ని బీజేపి వ్యతిరేకిస్తోందన్నారు. చంద్రబాబు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. టీడీపీ అభ్యర్థికి సహకరించేది లేదన్నారు. నాయకులు మధుసూదన్, వేణుగోపాల్, బద్రీనాథ్, ఈశ్వర్‌రెడ్డి, సోమశేఖర్, బాలగోపాల్, బాలాజీ, క్రిష్టప్ప, ముంతాజ్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

అగళి: పీ బ్యాడేగర్ చెక్‌పోస్టు వద్ద ఎస్‌ఐ వీరేష్ శనివారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఎన్నికల నేపథ్యంలో డబ్బు, మద్యం, ఇతర వస్తువుల రవాణాను నివారించేందుకు కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

వక్క, కొబ్బరి చెట్ల దగ్ధం

అగళి: దొక్కలపల్లి గ్రామంలోని రైతు గోవిందరాజు పొలంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో వక్క, కొబ్బరి చెట్లు దగ్ధమయ్యాయి. ఘటనలో మూడేళ్లన్న 500 వక్కచెట్లు, 50 కొబ్బరి చెట్లు, రూ.50 వేలు విలువైన డ్రిప్ పరికరాలు దగ్ధమైనట్లు బాధితుడు వాపోయాడు.

‘కాంగ్రెస్ అభ్యర్థికి సహకరించేది లేదు’

పావగడ: చిత్రదుర్గం లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి బీఎన్ చంద్రప్పకు ఎన్నికలలో ఎలాంటి పరిస్థితి ల్లోనూ సహకరించేది లేదని స్థానిక కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి వెంకటరమణప్ప ప్రకటించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత స్థానిక విధానసభ ఎన్నికల్లో తన కుమారుడు కాంగ్రెస్ అభ్యర్థి హెచ్‌వీ వెంకటేశ్‌కు వ్యతిరేకంగా చంద్రప్ప జేడీఎస్ అభ్యర్థితో చేతులు కలిపాడని ఆరోపించారు. అయితే స్థానిక ప్రజల ఆశీస్సులతో తన కుమారుడు భారీ మెజార్టీతో గెలుపొందాడని తెలిపారు. చంద్రప్పకు మినహా వేరెవరికి టికెట్టు ఇవ్వాలని కేపీసీసీకి సూచించినా అతనికే టికెట్టు ప్రకటించారని అసంతృప్తి వ్యక్తం చేశారు. చిత్రదుర్గం పార్లమెంట్ నియోజకవర్గం లోని వడ్డెర సామాజిక వర్గం ఓటర్లు ఎవరూ చంద్రప్పకు మద్దతు ప్రకటించరని అభిప్రాయపడ్డారు.

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

అగళి : మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో 2024–25 విద్యాసంవత్సరానికి గాను ఇంటర్ ఫస్టియర్‌లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ జాఫర్ శనివారం తెలిపారు. ఇంటర్ ఫస్టియర్‌లో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీలో 40 సీట్ల చొప్పున ఖాళీగా ఉన్నాయని, మే 22 లోపు దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.150, ఓసీ ,బీసీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు రూ.200 ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. మార్కుల మెరిట్, రిజర్వేషన్ ప్రకారం ప్రవేశాలు కల్పిస్తామని తెలియజేశారు.

అమరవీరులకు ఘన నివాళి



భగత్‌సింగ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

హిందూపురం టౌన్: ప్రాణాలను పణంగా పెట్టి భారతదేశ స్వాతంత్ర్యం కోసం భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురు వీరోచితంగా పోరాటం చేశారని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు బాబావలి అన్నారు. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ వర్ధంతి సందర్భంగా శనివారం పట్టణంలోని బైపాస్ రోడ్డులో ఉన్న భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చిన్నతనంలోనే దేశం కోసం ప్రాణాలర్పించారని, వీరు విద్యార్థులకు, యువతకు స్ఫూర్తి ప్రదాతలని అన్నారు. వారి పోరాట స్ఫూర్తితో జాతీయ నూతన విద్యా విధానంపై పోరాడుతామని చెప్పారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు చంద్రశేఖర్, జయచంద్ర, జగన్, భగత్, హర్షకుమార్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శనిత్రయోదశి



అలంకరణలో శనేశ్వర స్వామి

హిందూపురం: శనిత్రయోదశిని పురస్కరించుకుని శనివారం పట్టణంలోని శనేశ్వరస్వామి ఆలయాల్లో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక డీబీ కాలనీ, బెంగళూరు రోడ్డు హౌసింగ్ బోర్డు శనేశ్వర ఆలయాల్లో ఉదయం మూలవిరాట్ శనేశ్వర స్వామికి పంచామృతాభిషేకాలు, తిలతైలాభిషేకాలు చేశారు. విశేష అలంకరణతో అర్చనలు చేపట్టారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామికి నవగ్రహ శాంతిపూజలు చేశారు. ఆలయంలో దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం జేష్ఠ్యాదేవి సమేత శనేశ్వర స్వామిని పల్లకీలో కొలువుదీర్చి ప్రాకారోత్సవం నిర్వహించారు. మంగళహారతి అనంతరం భక్తులకు ప్రసాదం అందజేశారు.

మహిళా చట్టాలపై అవగాహన



మాట్లాడుతున్న సీఈఓ లావణ్య

రొద్దం: మండలంలోని పెద్దగువ్వలపల్లిలో అనంత శక్తి సొసైటీ న్యాయసలహా మండలి ఆధ్వర్యంలో శనివారం మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. దిశ, గృహ హింస, వేధింపులు, బాల్యవివాహాలు, మద్యపాన నిషేధం తదితర చట్టాలపై మహిళలకు నాటిక రూపంలో వివరించారు. అనంతశక్తి సొసైటీ సీఈఓ లావణ్య మాట్లాడుతూ ప్రతి మహిళా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎక్కడైనా మహిళలు వేధింపులకు గురైతే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికకు సహకరించాలి



మాట్లాడుతున్న ఎస్‌ఐ విజయ్ కుమార్

సోమందేపల్లి: గ్రామాల్లో ప్రశాంత ఎన్నికకు పార్టీలకు అతీతంగా సహకరించాలని ఎస్‌ఐ విజయ్ కుమార్ సూచించారు. శనివారం సాయంత్రం మండలంలోని చాలకూరులో గ్రామ సభ నిర్వహించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ పోలింగ్ సమయంలో గొడవలకు దిగిన ఓటర్లను ప్రలోభాలు, భయభ్రాంతులకు గురి చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మద్యం, డబ్బు పంపిణీపై నిఘా ఉంచామన్నారు. ఏఎస్‌ఐ మురళి, బీఎస్‌ఎఫ్ జవాన్లు పాల్గొన్నారు.

వడదెబ్బపై అవగాహన

సోమందేపల్లి: మండలంలోని పత్తికుంటపల్లిలో వడ దెబ్బ నివారణపై వైద్య సిబ్బంది శనివారం అవగాహన కల్పించారు. హెల్త్ సూపర్ వైజర్ రవీంద్ర మాట్లాడుతూ నీటితో పాటు మజ్జిగ, కొబ్బరి నీళ్ళు, పండ్ల రసాలు వంటి ద్రవ పదార్థాలను ఎక్కువగా తీసుకోవాలన్నారు. ఉపాధి కూలీలు, రైతులు పనులు చేసే సమయంలో తలకు టోపీ లేదా టువాల్ ధరించాలని సూచించారు. గ్రామాల్లో విలేజ్ క్లినిక్ లలో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.